తెలంగాణ
వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక :362 గురువారం 08-07- 2026 పేజీలు: 4 వెల రూ.

# శ్రీనిధి నిధులపై ముసురుకున్న మిస్టరీ..

## రూ.25 లక్షల డ్వాక్రా సొమ్ము స్వాహా?

### ఆర్పీ చేతిలో మోసపోయామంటూ కలెక్టర్‌కు మహిళల ఫిర్యాదు

నిర్మల్

నిర్మల్ జిల్లా కేంద్రంలో డ్వాక్రా మహిళా సంఘాలకు సంబంధించిన శ్రీనిధి నిధుల వ్యవహారం రోజురోజుకూ తీవ్ర దుమారం రేపుతోంది. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ నిధుల చుట్టూ ఇప్పుడు పెను మిస్టరీ ముసురుకుంది. నిర్మల్ పట్టణంలోని బ్రహ్మపురి కాలనీకి చెందిన 'సరస్వతి డ్వాక్రా గ్రూప్' నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగం కావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. నమ్మకంగా ఉండాల్సిన ఆర్పీ (రిసోర్స్ పర్సన్) కవితనే తమను నిలువునా ముంచేసిందంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను కలిసి బాధితులు కన్నీరుమున్నీరవుతూ వినతిపత్రం అందజేశారు.

**సంతకాలు ఫోర్జరీ చేసి రూ.25 లక్షలు డ్రా!**

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సరస్వతి డ్వాక్రా గ్రూప్‌నకు శ్రీనిధి ఆర్పీగా పనిచేస్తున్న కవిత, గ్రూప్ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, వారి సంతకాలను ఫోర్జరీ చేసి విడతల వారీగా దాదాపు రూ. 25 లక్షల నిధులను డ్రా చేసి దుర్వినియోగానికి పాల్పడింది. తాము తీసుకున్న రుణాల సొమ్మును సక్రమంగానే చెల్లిస్తున్నామని భావించిన మహిళలకు, ఇటీవల బ్యాంకు అధికారుల నుంచి రికవరీ నోటీసులు రావడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ నోటీసుల ఆధారంగా రికార్డులను పరిశీలించగా, తమకు తెలియకుండానే ఇంత పెద్ద మొత్తంలో నిధులు పక్కదారి పట్టినట్లు వెలుగుచూసింది.



తామంతా పేద కుటుంబాలకు చెందిన మహిళలమని, ఇప్పుడు బ్యాంకు నోటీసుల వల్ల మానసిక ఆందోళనకు గురవుతున్నామని వారు కలెక్టర్ ఎదుట వాపోయారు.

**బాధితులకు న్యాయం జరిగేనా.. దర్యాప్తుపైనే ఆశలు!**

ఈ నిధుల గోల్‌మాల్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అసలు ఎవరికి ఎంత మొత్తం చేరింది, ఎవరి ఖాతాల్లోకి ఈ నిధులు బదిలీ అయ్యాయి అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి నిజా నిజాలు తేల్చాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి ఆర్థిక అవకతవకలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు అవి కేవలం కార్యాలయాల ఫైళ్లకే పరిమితమయ్యాయనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం శ్రీనిధి నిధులపై వెల్లువెత్తిన ఈ లొసుగుల వ్యవహారంలోనైనా పూర్తి స్థాయి దర్యాప్తు జరిగి డ్వాక్రా మహిళలకు న్యాయం జరుగుతుందా..? లేక ఈ వ్యవహారం కూడా ఫిర్యాదులకే పరిమితమవుతుందా..? అనే ప్రశ్నలు బాధితుల్లో వ్యక్తమవుతున్నాయి.

**క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్**

ప్రస్తుతం ఈ వ్యవహారంలో అధికారుల స్పందనే అత్యంత కీలకంగా మారింది. మహిళల పొదుపు సొమ్మును స్వాహా చేసిన సదరు ఆర్పీ కవితపై శాఖాపరమైన విచారణ జరిపి, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే దుర్వినియోగమైన సొమ్మును ఆమె నుండి రికవరీ చేయించి తమకు న్యాయం చేయాలని లీడర్లు, సభ్యులు కలెక్టర్‌ను వేడుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిరుపేద డ్వాక్రా మహిళల ఆవేదనను దూరం చేయాలని నిర్మల్ పట్టణ ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# చంద్రబాబుకు గురుదక్షిణ కోసమే నీళ్లు వదులుతున్నారు



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని వివిధ జలాశయాలలో సాగునీటి నిల్వలు తగినంతగా ఉన్నప్పటికీ, ఇక్కడి రైతులకు పంటల కొరకు అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దిగువ ప్రాంతాలకు నీటిని వదులుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి 'గురుదక్షిణ' సమర్పించుకోవడానికే, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఇక్కడి జలాలను దిగువ రాష్ట్రానికి అప్పనంగా తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వ వైఖరి వల్ల రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, కరీంనగర్ వంటి పలు జిల్లాల రైతాంగం సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను, ప్రయోజనాలను పొరుగు రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

నీటి నిర్వహణలో ప్రభుత్వానిది నేరపూరిత అలసత్వం

రాష్ట్రంలో సాగునీటి నిర్వహణ, ప్రాజెక్టుల నీటి నిల్వల నియంత్రణ విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా, చేతకానితనంతో వ్యవహరిస్తోందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మన స్వంత రాష్ట్ర అవసరాలను, రైతుల ప్రయోజనాలను పూర్తిగా పక్కనబెట్టి, దిగువకు భారీగా నీటిని విడుదల చేయడం పరిపాలనా పరంగా 'నేరపూరిత అలసత్వమే' అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పంటలు ఎండిపోతున్నా రైతులకు ఇవ్వకుండా కాలయాపన చేయడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం దాగి ఉందనే అనుమానాన్ని ఆయన వ్యక్తపరిచారు. ముందస్తు ప్రణాళిక లేకుండా నీటిని వదిలేయడం వల్ల భవిష్యత్తులో తెలంగాణలో త్రాగునీటి ఎద్దడితో పాటు, రాబోయే సాగు కాలానికి తీవ్రమైన నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన వాతావరణ, జలవనరుల నిపుణుల హెచ్చరికలను గుర్తుచేశారు.

శాసనసభలోనైనా, బహిరంగ వేదికపైనైనా చర్చకు సిద్ధం

సాగునీటి విడుదల, ప్రాజెక్టుల నిర్వహణ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంతో బహిరంగ చర్చకు తాము పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అధికార పక్షం నుంచి ముఖ్యమంత్రితో సహా ఏ మంత్రి లేదా ఏ నాయకుడు చర్చకు వచ్చినా, తాము తగిన ఆధారాలు, లెక్కలతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఒకవేళ వీలైతే రాబోయే శాసనసభ సమావేశాలలోనూ నీటి విడుదల, సాగునీటి నిర్వహణపై ప్రత్యేక చర్చకు ప్రభుత్వం సమయం కేటాయించాలని, అక్కడ కూడా తాము ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. పాలకులకు నిజాయితీ ఉంటే తమ సవాల్‌ను స్వీకరించి, నీటి విడుదలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# హరిత ఇంధన ముసుగులో వినియోగదారులపై భారం, అనాలోచిత విధానాలు

భారతదేశ ఇంధన రంగంలో స్వయంసమృద్ధిని సాధించేందుకు, పర్యావరణ పరిరక్షణను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇథనాల్ మిశ్రణ విధానం, ఇప్పుడు ఊహించని విధంగా వివాదాలకు, ప్రజల అసంతృప్తికి వేదికగా మారింది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం (జు20) ద్వారా ముడి చమురు దిగుమతుల భారాన్ని తగ్గించుకోవచ్చనే ప్రభుత్వ ఆశయం కాగితంపై వినడానికి చాలా బాగున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దీని అమలు తీరు మాత్రం తీవ్ర లోపాలతో కూడి ఉంది. ఈ హరిత ఇంధన మార్పు ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరు చూస్తుంటే, ఇది పర్యావరణ హితం కంటే వినియోగదారులను ఇబ్బందుల్లోకి నెట్టే ఒక ఏకపక్ష నిర్ణయంగా కనిపిస్తోంది. పారదర్శకత లేని విధానాలు, ముందస్తు ప్రణాళిక లోపించడం వల్ల ఈ ఉన్నతమైన పథకం కాస్తా సామాన్యుడికి శాపంగా మారే ప్రమాదం పొంచి ఉంది.

ప్రభుత్వ అనుకూల సాంకేతిక సంస్థలు ఈ కొత్త ఇంధనం వల్ల వాహనాల యంత్రాలకు తక్షణమే భారీ నష్టం వాటిల్లడం లేదని ధృవీకరిస్తున్నప్పటికీ, రోజువారీ వాహనదారులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి చేదు నిజాలను అవి దాచలేవు. ఇథనాల్ యొక్క తక్కువ ఉష్ణ శక్తి విలువ (శ్రీశీవతీ ఝశ్రీశీతీఱటఱఝ ఝశ్రీబవ) కారణంగా మైలేజ్ గణనీయంగా తగ్గుతోందనేది వాహన యజమానుల ప్రధాన ఆందోళన. ఇంధన ధరలు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో, ఈ మైలేజ్ నష్టం అంతిమంగా వినియోగదారుడి సొంత ఖర్చులకే అదనపు చిల్లు పెడుతోంది. ఒకవైపు పర్యావరణాన్ని కాపాడుతున్నామనే ప్రచారం చేస్తూ, మరోవైపు ఆ ఆర్థిక భారాన్ని సామాన్య వాహనదారుడిపైకి నెట్టడం ఏ రకమైన ప్రజాస్వామ్య పాలన అనిపించుకుంటుంది? దీనికంటే దారుణమైన విషయం ఏమిటంటే, ప్రస్తుతం దేశంలో తిరుగుతున్న లక్షలాది పాత వాహనాలు ఈ జు20 ఇంధనానికి ఏమాత్రం అనుకూలమైనవి కావు. పాత వాహనాలలోని ఇంధన సరఫరా వ్యవస్థలు, ముఖ్యంగా రబ్బరు భాగాలు, గొట్టాలు ఈ ఇంధనం వల్ల వేగంగా పాడైపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వినియోగదారులకు ఎలాంటి సరైన ప్రత్యామ్నాయం లేదా ఎంపిక స్వేచ్ఛను ఇవ్వకుండా, బలవంతంగా ఈ కొత్త ప్రమాణాలను రుద్దడం వల్ల, పాత వాహనదారులు తమ తప్పు లేకుండానే అదనపు మరమ్మతు ఖర్చులను భరించాల్సి వస్తోంది. ఈ విధానంలో కనీసం పాత వాహనాల కోసం జు10 (10% ఇథనాల్) ఇంధనాన్ని సమాంతరంగా మార్కెట్లో అందుబాటులో ఉంచే కనీస జాగ్రత్తను కూడా ప్రభుత్వం తీసుకోకపోవడం గమనార్హం. ఇది వినియోగదారుల ప్రాథమిక హక్కులను కాలరాయడమే అవుతుంది.

ఈ ఇంధన మార్పు కోసం అనుసరిస్తున్న వ్యూహం ఎంత అనాలోచితంగా ఉందో అంతర్జాతీయ ఉదాహరణలను చూస్తే అర్థమవుతుంది. ఇథనాల్ మార్కెట్‌లో అగ్రగామిగా ఉన్న బ్రెజిల్ వంటి దేశాలు ఈ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి దాదాపు ఐదు దశాబ్దాల సుదీర్ఘ సమయాన్ని తీసుకున్నాయి. అంతేకాకుండా, అక్కడ వినియోగదారులకు తమ ఆర్థిక స్థితిని, వాహన సామర్థ్యాన్ని బట్టి చౌకైన ఇంధనాన్ని ఎంచుకునే అనుకూల ఇంధన (టశ్రీవఞ-టబవశ్రీ) స్వేచ్ఛ ఉంది. కానీ భారతదేశంలో మాత్రం ఆటోమొబైల్ రంగానికి, వినియోగదారులకు తగిన సమయం ఇవ్వకుండా, రాత్రికి రాత్రే లక్ష్యాలను ప్రజలపై రుద్దే ధోరణి కనిపిస్తోంది. ఇటువంటి తొందరపాటు చర్యలు మార్కెట్‌లో తీవ్ర అస్థిరతకు దారితీస్తాయి.

ఈ విధానంలో ఉన్న మరొక పెద్ద వైరుధ్యం ఏమిటంటే---ఇథనాల్ ఉత్పత్తి కోసం ఎంచుకున్న ముడి పదార్థాలు, దాని వెనుక ఉన్న అసంబద్ధ వ్యవసాయ విధానం. భారతీయ ఆహార సంస్థ (ఖీజ×) వద్ద ఉన్న మిగులు బియ్యాన్ని పెద్ద ఎత్తున ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వం భారీ ఆర్థిక వ్యయంతో ప్రజల సొమ్మును వెచ్చించి రైతుల నుండి బియ్యాన్ని సేకరించి, మళ్లీ దాన్ని ఇథనాల్ తయారీదారులకు భారీ ధర తగ్గింపుతో విక్రయించడం ఏ రకమైన ఆర్థిక తర్కమో అర్థం కావడం లేదు. ఇది మార్కెట్ సూత్రాలకు విరుద్ధంగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరంగా కూడా పెద్ద వినాశనం. బియ్యం (వరి) సాగుకు విపరీతమైన నీరు అవసరమవుతుంది, పైగా ఇది మిథేన్ వాయు ఉద్గారాలకు ప్రధాన కారణం. ఒకవైపు పర్యావరణాన్ని కాపాడటానికి ఇంధనాన్ని మారుస్తూ, మరోవైపు అదే ఇంధనం కోసం పర్యావరణాన్ని దెబ్బతీసే పంటలను ప్రోత్సహించడం ప్రభుత్వ విధానాలలోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతోంది.

భారతదేశపు ఇథనాల్ మిశ్రణ విధానం ప్రస్తుత రూపంలో వినియోగదారుల హక్కులను, ఆర్థిక సూత్రాలను కాలరాసేలా ఉంది. ముడి పదార్థాల ఎంపికలో వరి లేదా చెరకు వంటి నీటిని మింగే పంటల కంటే మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయాలను దీర్ఘకాలికంగా వాడుకోలేకపోవడం ప్రభుత్వ పరిపాలనా అసమర్థతకు నిదర్శనం. వ్యవసాయ రంగ నిపుణులు ఎంతో మొత్తుకుంటున్నా వినకుండా, కేవలం కొన్ని వ్యాపార శక్తుల ప్రయోజనాల కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలి. వినియోగదారులకు ఇంధన ఎంపిక స్వేచ్ఛను ఇవ్వకుండా, లోపభూయిష్టమైన ఆర్థిక విధానాలతో ముందుకు సాగితే, ఈ హరిత ఇంధన విప్లవం కేవలం కాగితాలకే పరిమితమౌతుంది. ఇది సామాన్య ప్రజలపై మోయలేని భారంగా మిగిలిపోవడమే కాకుండా, పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే ఒక వ్యర్థ ప్రయోగంగా చరిత్రలో మిగిలిపోవడం నిశ్చయం. ఇకనైనా లోపాలను సరిదిద్ది, ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో ఈ విధానాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.






వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871


# ఒకే రోజు 233 ఓటర్ ఫారాల డిజిటలీకరణ:

## బీఎల్ఓ ఆశాలతను అభినందించిన సబ్ కలెక్టర్



ఆర్మూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమంలో భాగంగా అద్భుత ప్రతిభ కనబరిచిన బూత్ లెవెల్ అధికారిని (బీఎల్ఓ) ఆర్మూర్ సబ్ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సుర్బిర్యల్ గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 14 అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆశాలత బుధవారం ఒకే రోజు అత్యధికంగా 233 ఓటర్ ఫారాల డిజిటలీకరణ ప్రక్రియను ఆన్‌లైన్ లో పూర్తి చేశారు. క్షేత్రస్థాయిలో ఇంత వేగంగా, పారదర్శకంగా రికార్డుల నమోదు పూర్తి చేసినందుకు సబ్ కలెక్టర్ ఆమెను ప్రశంసించారు. విధుల్లో ఇలాంటి నిబద్ధత చూపడం మిగతా సిబ్బందికి ఆదర్శనీయమన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఎంఆర్ఐ) ఎర్మ శ్రీనివాస్, సూరబీర్యాల్ సర్పంచ్ బామర్తి సంధ్యారాణి, పంచాయితీ కార్యదర్శి, సుర్బిర్యల్ శంకరయ్య, మండల పంచాయతీ అధికారి పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఎంజే ఆసుపత్రిలో ప్రతి బుధవారం ప్రముఖ నరాల వైద్యుల సేవలు



ఆర్మూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ పట్టణ ప్రజల వైద్య అవసరాల నిమిత్తం ప్రతి బుధవారం స్థానిక ఎంజే హాస్పిటల్‌లో నిజామాబాద్ మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ నరాల వైద్య నిపుణుడు (న్యూరాలజిస్ట్) డాక్టర్ మోసిన్ ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంటారని హాస్పిటల్ యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మెదడు, వెన్నుపాము, నరాలకు సంబంధించిన వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు డాక్టర్ మోసిన్‌ను సంప్రదించి నిపుణుల వైద్య సలహాలు, ఆధునిక చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా తీవ్రమైన తలనొప్పి, మైగ్రేన్, పక్షవాతం, మూర్ఛ వ్యాధి (ఫిట్స్), నరాల బలహీనత, చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, జ్ఞాపకశక్తి సమస్యలు వంటి నరాల సంబంధిత రుగ్మతలకు ఇక్కడ అత్యాధునిక వైద్యం అందించబడుతుందన్నారు. నరాల సమస్యలు ఉన్న రోగులు ప్రతి బుధవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల మధ్య ఆర్మూర్‌లోని ఎంజే హాస్పిటల్‌ను సందర్శించి ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంజే హాస్పిటల్ డాక్టర్ మధుశేఖర్, సీనియర్ జనరల్ అండ్ లాప్రోస్కోపీ సర్జన్, డాక్టర్ మోసిన్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే సమాజంలో మార్పు: మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు



ఆర్మూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, పరస్పర సహకారాన్ని, మానవత్వ విలువలను పెంపొందిస్తాయని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో వెలిసిన అయ్యప్ప దేవాలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్మూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో భక్తుల కొరకు ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఆమె అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో అన్నదానాన్ని మహాదానంగా భావిస్తారని, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ద్వారా దైవానుగ్రహం లభిస్తుందన్నారు. అయ్యప్ప స్వామి బోధించిన క్రమశిక్షణ, సేవాతత్వం, సమానత్వ భావనను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలన్నారు. అనంతరం నగేష్ శర్మ గురుస్వామి మున్సిపల్ ఛైర్‌పర్సన్ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు పుట్టి మురళి, రవి, జనార్ధన్ గౌడ్, దత్తు, పోల సుధాకర్, అశోక్, మున్సిపల్ కౌన్సిలర్లు బొగడమీది సుమన్, బొొప్పెన ప్రసాద్, బీజేపీ నాయకులు నూతుల శ్రీనివాస్, కంచెట్టి గంగాధర్, ఉదయ్ పాల్గొన్నారు.

## మృతి చెందిన సర్పంచ్ నక్క మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

ముధోల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన స్థానిక సర్పంచ్ నక్క మల్లేష్ ఇటీవల అనారోగ్య కారణాలతో అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం రువ్వి గ్రామంలోని మృతుడి నివాసానికి కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యుడు గడ్డం విఠల్ రెడ్డి విచ్చేసి, నక్క మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చుతూ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, తాము ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ, నక్క మల్లేష్ మరణం రువ్వి గ్రామానికి తీరని లోటన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా గ్రామానికి ఎన్నో సేవలు చేయాలనుకున్న ఆయన చిన్న వయసులోనే మరణించడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. కార్యక్రమంలో విట్టోలి తాండ సర్పంచ్ కాంత్ రావు, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు రామ్ రెడ్డి, గౌతమ్, కిష్టయ్య, మండల నాయకులు గంగాధర్, రంగారావు, లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలు వదిలి వివాదాలతో వార్తల్లో ఉండేందుకు కొందరి ప్రయత్నం

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు..



హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర రాజకీయాల్లో ఇటీవల తీవ్ర చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ లేఖ వ్యవహారంపై స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు, సీనియర్ రాజకీయ దురంధరుడు కడియం శ్రీహరి పరోక్షంగా అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో ఉంటూ ప్రజల మధ్య తిరగలేని కొందరు నాయకులు, కేవలం వివాదాస్పద అంశాలను సృష్టిస్తూ నిరంతరం వార్తల్లో నిలిచేందుకు తాపత్రయపడుతుంటారని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. తమ పరిధిలోని శాఖల అధికారులను తమకు తెలియకుండా, తమ అనుమతి లేకుండా ఇతర ప్రజాప్రతినిధులు ఎందుకు కలిశారంటూ కొందరు బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ప్రశ్నించడం పూర్తిగా అవివేకమని ఆయన కొట్టిపారేశారు. ప్రజాస్వామ్య పరిపాలనా వ్యవస్థలో ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు మధ్య ఉండే నిరంతర సమన్వయాన్ని, సంబంధాలను ఇటువంటి వివాదాల ద్వారా ప్రశ్నించడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక సమావేశంలో ఆయన ఈ విషయాలపై సుదీర్ఘంగా మాట్లాడారు.

అధికారులను కలవడం నిరంతర ప్రక్రియ

ఒక నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు సజావుగా సాగాలన్నా, ప్రజల ఇబ్బందులు తొలగాలన్నా స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు) సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులను కలవడం అనేది పరిపాలనా పరంగా అత్యంత సహజమైన మరియు నిరంతరాయంగా సాగే ప్రక్రియ అని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీరు, సాగునీరు, రోడ్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా వంటి అనేక ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు నిరంతరం సచివాలయంలో లేదా జిల్లాల పరిధిలోని అధికారులతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుందని ఆయన వివరించారు. అలాగే ఇప్పటికే మంజూరైన వివిధ మౌలిక వసతుల పనుల పురోగతిని పర్యవేక్షించడం, నిలిచిపోయిన పనులకు సంబంధించిన నిధుల విడుదల కోసం ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకురావడం ప్రతి ప్రజాప్రతినిధి యొక్క ప్రాథమిక విధి అని గుర్తుచేశారు. ఈ విధమైన సాధారణ, చట్టబద్ధమైన పరిపాలనా పరమైన సమావేశాలను కూడా రాజకీయం చేస్తూ, వివాదాస్పదంగా మార్చాలని చూడటం దురదృష్టకరమని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

చౌకబారు ప్రచారం వల్ల ప్రయోజనం లేదు

ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ఎప్పుడూ ప్రజలతో నిరంతర ప్రత్యక్ష సంబంధాలు కొనసాగిస్తూ ఉండాలని, వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో శ్రమించాలని కడియం శ్రీహరి సూచించారు. అలా ప్రజల మధ్య ఉంటూ నిరంతరం పనిచేయకుండా, కేవలం అంతర్గత విభేదాలు, లేఖల పరంపరలు, వివాదాలు సృష్టించడం ద్వారా మీడియాలో చౌకబారు ప్రచారం పొందాలని ప్రయత్నించడం వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. ఇటువంటి చర్యల వల్ల ప్రజల్లో నాయకుల పట్ల నమ్మకం సడలుతుందని, పార్టీల ప్రతిష్ట కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల ఉనికి వారు చేసే పనుల్లో ఉండాలే తప్ప, వివాదాల్లో కాదని హితవు పలికారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం

రాష్ట్రంలో ఎన్నో కీలకమైన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి ప్రజా ఉపయోగకరమైన అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాల్సిన తరుణం ఆసన్నమైందని కడియం శ్రీహరి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హామీల అమలు, నిధుల సర్దుబాటు, మౌలిక సదుపాయాల కల్పన వంటి ఎన్నో ప్రాధాన్యత కలిగిన సవాళ్లు ముందున్న సమయంలో, ప్రజాప్రతినిధులు ఇలాంటి అనవసరమైన, వ్యక్తిగత పట్టింపుల వివాదాలకు ప్రాధాన్యత ఇస్తూ విలువైన పరిపాలనా సమయాన్ని వృథా చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నాయకులు తమ వ్యక్తిగత అహాలను, పట్టింపులను పక్కనబెట్టి, కేవలం ప్రజల శ్రేయస్సు మరియు రాష్ట్ర ప్రగతిని మాత్రమే పరమావధిగా చేసుకుని ముందుకు సాగాలని, అప్పుడే ప్రజాస్వామ్యానికి, ప్రజలకు నిజమైన న్యాయం జరుగుతుందని ఆయన తన ప్రకటనలో ముగించారు.

## దేశవ్యాప్తంగా వర్ష బీభత్సం: ముంచెత్తిన ముండపోత వానలు..

న్యూఢిల్లీ:
దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఉధృతంగా కదులుతుండటంతో పలు రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ముంబయి, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, కేరళ, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ వంటి పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమై, జనజీవనం తీవ్రంగా స్తంభించింది.

ముంబయికి ఆరెంజ్ అలర్ట్.. స్తంభించిన రవాణా

ఆర్థిక రాజధాని ముంబయిలో రికార్డు స్థాయిలో కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ప్రధాన రహదారులపైకి భారీగా నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రానున్న రోజుల్లోనూ వర్షాల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు ముంబయికి 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా జాతీయ విపత్తు స్పందన దళాలు (చీణ=ఖీ), స్థానిక సహాయక బృందాలను యంత్రాంగం అప్రమత్తం చేసింది.

ఉత్తరాదిని ముంచెత్తుతున్న వరదలు

ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పలు ప్రధాన నగరాల్లోని డ్రైనేజీ వ్యవస్థలు ఉప్పొంగి రహదారులు జలమయమయ్యాయి. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుజరాత్‌లోని కొన్ని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

కొండచరియలు విరిగిపడే ప్రమాదం.. పర్వత ప్రాంతాల్లో హై అలర్ట్

మరోవైపు కేరళలో వర్షాల ఉధృతి కొనసాగుతుండగా.. పర్వత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో కుండపోత వానలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొండ ప్రాంతాలలో హఠాత్తుగా వచ్చే వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్), కొండచరియలు విరిగిపడే (లాండ్‌స్లైడ్స్) ముప్పు పొంచి ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, పర్యాటకులు తక్షణమే అప్రమత్తం కావాలని స్థానిక ప్రభుత్వాలు సూచించాయి.

ప్రస్తుతం వర్ష ప్రభావిత ప్రాంతాల్లోని పరిస్థితులను స్థానిక జిల్లా యంత్రాంగాలు, విపత్తు నిర్వహణ శాఖలు నిరంతరం పర్యవేక్షిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేస్తున్నాయి.



# ఇరాన్‌పై మళ్లీ అమెరికా చమురు ఆంక్షల అస్త్రం

వాషింగ్టన్:
అంతర్జాతీయ రాజకీయాలలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై అమెరికా మరోసారి చమురు ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించింది. ఇరాన్ చమురు ఉత్పత్తి, సరఫరా, విక్రయాలకు సంబంధించి గత నెలలో ఇచ్చిన ఆంక్షల మినహాయింపును డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. అమెరికా ఆర్థిక శాఖకు చెందిన విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం గతంలో జారీ చేసిన సాధారణ అనుమతిని రద్దు చేస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల అంతర్జాతీయ చమురు మార్కెట్ లో ఒడిదుడుకులు వచ్చే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

ఒప్పందాల అమలు ప్రవర్తనపైనే ఆధారం

అమెరికా--ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అమలు పూర్తిగా ఇరాన్ ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుందని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇరాన్ తన అంతర్జాతీయ బాధ్యతలను సక్రమంగా పాటిస్తేనే ఒప్పందం ద్వారా లభించే ప్రయోజనాలను పొందగలదని పేర్కొంది. అమెరికా ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్యలకు, అలాగే ప్రాంతీయ శాంతికి భంగం కలిగించే పనులకు పాల్పడితే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఈ సందర్భంగా గట్టిగా హెచ్చరించింది. ఇరాన్ అణ్వాయుధ సంపాదన ప్రయత్నాలను అడ్డుకోవడమే తమ ప్రధాన ఉద్దేశమని అమెరికా అధికారులు వెల్లడించారు.

లావాదేవీల ముగింపునకు జూలై 17 వరకు గడువు

గత నెలలో ఇరాన్ చమురు, పెట్రోలియం ఉత్పత్తుల విక్రయాలకు ఆగస్టు 21 వరకు తాత్కాలిక అనుమతి ఇచ్చిన అమెరికా, తాజా అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. అయితే ఇప్పటికే ప్రపంచ దేశాలతో ప్రారంభమైన వ్యాపార లావాదేవీలను ముగించుకునేందుకు జూలై 17 వం-కు గడువు ఇచ్చినట్లు సమాచారం. అమెరికా తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో ఇరాన్ చమురు ఎగుమతులపై మళ్లీ ఆర్థిక ఆంక్షల ఒత్తిడి తీవ్రం కానుంది.

ఆర్థిక వనరులను దెబ్బతీసే వ్యూహం

ఇరాన్ దేశానికి చమురు ఎగుమతులే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నాయి. ఈ ఎగుమతులను అడ్డుకోవడం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీ-యాలని అమెరికా వ్యూహంగా కనిపిస్తోంది. గతంలో కూడా ఇటువంటి ఆంక్షల వల్ల ఇరాన్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. తాజా ఆంక్షల రద్దుతో ఇరాన్ నుండి చమురు కొనుగోలు చేసే ఇతర దేశాలు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇరాన్ దీనిపై ఎలా స్పందిస్తుందనే అంశంపై ఇప్పుడు ప్రపంచ దేశాల దృష్టి నెలకొంది.



# ఆన్‌లైన్ జీపీఎస్ ట్రాకర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి



నిర్మల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఫార్మా కంపెనీలు నూతనంగా అమలు చేస్తున్న ఆన్‌లైన్ జీపీఎస్ ట్రాకర్ విధానం కార్మికులు, ఉద్యోగుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉన్న ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా కేంద్రంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టిఎంఎస్‌ఆర్యు-సీఐటీయూ) నిర్మల్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ, నిరంతర పర్యవేక్షణ పేరుతో ఉద్యోగులపై ఆన్‌లైన్ ట్రాకింగ్ పెట్టడం వల్ల వారిపై మానసిక ఒత్తిడి విపరీతంగా పెరుగుతోందన్నారు. ఉద్యోగులను వేధించే విధంగా ఉన్న ఈ విధానాన్ని కంపెనీలు వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే మెడికల్ రిప్రజెంటేటివ్స్‌పై అసహజమైన అమ్మకాల లక్ష్యాలు (టార్గెట్లు) విధించడం, ఉద్యోగ భద్రత లేకుండా అన్యాయంగా తొలగించడం, పని గంటలు పెంచడం, సెలవులు నిరాకరించడం, ప్రయాణ భత్యాలు, డీఏ సక్రమంగా చెల్లించకపోవడం దారుణమన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, సభ్యులు శ్రీకాంత్, శ్రీనాథ్, సాయిలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆర్మూర్ ప్రభుత్వ బాయ్స్ కాలేజీలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు




ఆర్మూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ పట్టణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మన కాలనీ -- మన భద్రత, మన బాధ్యత' అనే ప్రత్యేక ప్రజా భద్రతా కార్యక్రమంలో భాగంగా బుధవారం పిప్రి రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో (గవర్నమెంట్ బాయ్స్ కాలేజ్) విద్యార్థులకు మత్తు పదార్థాల నిర్మూలనపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ గౌడ్ విద్యార్థులతో మాట్లాడుతూ, మత్తు పదార్థాల (డ్రగ్స్) బారిన పడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఇంటర్నెట్ లో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల విద్యార్థులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రయాణాల్లో ట్రాఫిక్ నియమాలను పక్కాగా పాటించాలన్నారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం పనిచేస్తున్న షీ టీమ్స్ సేవలను, కాలనీల్లో భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

# సీపీఎస్ రద్దు కొరకు త్వరలో హైదరాబాదులో ఆమరణ దీక్ష: కృష్ణారావు



నిర్మల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఉద్యోగులకు నష్టం చేకూరుస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరుతూ త్వరలోనే హైదరాబాదులో ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటామని సీపీఎస్ టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీపీఎస్ కృష్ణారావు ప్రకటించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా సీపీఎస్ రద్దు కోసం ఉద్యమిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ హామీని నెరవేరుస్తారనే నమ్మకం ఉందన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన డీఏ బకాయిలను (ఏరియర్స్) కొన్నింటిని విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, మిగిలిన బకాయిలను కూడా ఈనెల బిల్లుల్లోనే పూర్తి మొత్తంలో చెల్లించాలని కోరారు. హైదరాబాదులో ఆమరణ దీక్షతో పాటు అన్ని జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు కూడా ప్రారంభిస్తామన్నారు. కొందరు అధికారులు ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే సీపీఎస్ రద్దు కార్యాచరణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# ఎస్ఐఆర్ ఓటర్ ఫారాల సర్వేను పరిశీలించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

## - డిజిటలీకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలి



నిర్మల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఫారముల డిజిటలీకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ నిర్మల్ పట్టణంలోని గాజులపేట్ లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఓటర్లు పూర్తి చేసి తిరిగి ఇచ్చిన ఎస్ఐఆర్ ఫారముల కంప్యూటరైజేషన్, ఆన్‌లైన్ నమోదు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓ) డిజిటలీకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తిచేసిన డిజిటలైజేషన్ వివరాలను బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ప్రతి ఓటరు ఇళ్లకు వెళ్లి, నింపిన ఫారములను తిరిగి స్వయంగా సేకరించాలని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టాలన్నారు. సూపర్వైజర్లు ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. స్థానికంగా నివాసం ఉన్న ఓటర్ల ఇళ్లకు వెళ్లి, వారు ఎస్ఐఆర్ ఫారములు నింపుతున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే, హెల్ప్ డెస్క్ లో అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ దేవీదాస్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసిల్దార్ రాజు పాల్గొన్నారు.

# ఖానాపూర్ గాంధీనగర్ దళిత కాలనీ సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం సర్వే



ఖానాపూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఖానాపూర్ పట్టణ పరిధిలోని గాంధీనగర్ దళిత కాలనీలో ప్రత్యేక సర్వే నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య మాట్లాడుతూ, గాంధీనగర్ దళిత కాలనీ ఖానాపూర్ పట్టణ పరిధిలో ఉన్నప్పటికీ, సుమారు 600కు పైగా ఓట్లు కలిగి ఉన్నా కాలనీలో కనీసం రేషన్ షాపు లేకపోవడం శోచనీయమన్నారు. దీనివల్ల కాలనీవాసులు రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతూ పక్కనే ఉన్న శాంతినగర్ కు వెళ్లాల్సి వస్తోందన్నారు. శాంతినగర్ నుండి గాంధీనగర్ కు వెళ్లే రోడ్డు అత్యంత ఇరుకుగా ఉండటం వల్ల ప్రజలు, వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కాలనీలో అర్హులైన వికలాంగులు, వితంతువులు, బీడీ కార్మికులకు పెన్షన్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి స్థలం ఉండి కూడా ఇందిరమ్మ ఇండ్లకు నోచుకోని పేదలు అనేకమంది ఉన్నారన్నారు. గాంధీనగర్ దళిత పేదల సమస్యలపై ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే రేషన్ షాపు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పానగంటి నరేష్ కుమార్, చింతలపల్లె శంకర్, నాగుల నర్సాగౌడ్, నారపాక నర్సయ్య, రమేష్, లావణ్య, వనిత పాల్గొన్నారు.

# అష్ట గ్రామంలో వన మహోత్సవం.. ఇంటింటికీ మొక్కల పంపిణీ



ముధోల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం అష్ట గ్రామంలో ఇంటింటికీ తిరిగి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ మాట్లాడుతూ, చెట్లు మానవాళికి ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటి ప్రాంగణంలో కనీసం ఆరు మొక్కలను నాటి, వాటిని బాధ్యతగా సంరక్షిస్తే గ్రామం పచ్చదనంతో కళకళలాడుతుందని పేర్కొన్నారు. గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్, నాయకులు ప్రవీణ్, సంజు, ఎర్రన్న, ప్రకాష్, మల్లేష్ పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ఫారం సమర్పించాలి



ముధోల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వెంకటాపూర్ సర్పంచ్ శ్రావణి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఓటర్ల నుంచి ఎస్ఐఆర్ ఫారాల నమోదు, సేకరణ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రావణి గంగశేఖర్ మాట్లాడుతూ, గ్రామంలోని అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఎస్ఐఆర్ ఫారం సమర్పించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు నిరంతరంగా కొనసాగాలంటే ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తులను పూర్తి చేసి ఇవ్వాలన్నారు. ఆధార్ కార్డు, పాత ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కూడిన పత్రాలను జతచేసి బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ఓ) అందజేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉత్తమ్, వీవో రాజు, బీఎల్ఓ కవిత, గ్రామ యువకులు భోజందర్, శ్రీనివాస్, సాయి, తరుణ్ పాల్గొన్నారు.

# టాక్లి గ్రామంలో వైభవంగా గ్రామదేవతల నూతన విగ్రహాల ప్రాణప్రతిష్ఠ

బాసర, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని టాక్లి గ్రామంలో గ్రామదేవతల ఆలయాల నూతన విగ్రహాల ప్రాణప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గత కొన్ని దశాబ్దాల నుండి గ్రామంలోని గ్రామ దేవతల ఆలయాలు సరైన అభివృద్ధికి నోచుకోకపోవడంతో పూజలు చేయడానికి భక్తులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన స్థానిక దాతలు బి. డాక్టర్, శంకర్, మహాదేవ్ ఆలయ విస్తరణకు అవసరమైన భూమిని ఉదారంగా విరాళంగా అందజేశారు. అలాగే చిలకల చిన్నవ్వ విగ్రహాన్ని దాతలు అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు గ్రామ సర్పంచ్ విష్ణు షెల్కే ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆలయంలో నూతనంగా మహాలక్ష్మి, పోచమ్మ, చిలకల చిన్నవ్వ విగ్రహాలను ప్రతిష్టించి శాస్త్రోక్తంగా ప్రాణ ప్రతిష్ట వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ విష్ణు షెల్కే మాట్లాడుతూ, ముందుకొచ్చిన దాతలకు గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీరాజి పటేల్, ఆలయ ట్రస్ట్ సభ్యులు శంకర్, సాయినాథ్, గంగులే గంగాధర్ పాల్గొన్నారు.





# ఆర్మూర్ లో ప్రాథమిక పాఠశాలల బేస్ లైన్ టెస్ట్ తనిఖీ




ఆర్మూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): కేంద్ర ప్రభుత్వ ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) విద్యా విధానం అమలులో భాగంగా, ఆర్మూర్ మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో రెండో తరగతి నుండి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బుధవారం బేస్ లైన్ టెస్ట్ పరీక్షలను మొబైల్ యాప్ ద్వారా నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన ఈ పరీక్షల్లో భాగంగా అంకాపూర్ గ్రామంలోని మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను విద్యాశాఖ అధికారులు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు యాప్ లో విద్యార్థుల మార్కులను నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. బుధవారం నాటి పరీక్షలకు హాజరుకాని మిగిలిన విద్యార్థులకు గురువారం నాటి గడువులోగా ఈ బేస్ లైన్ టెస్ట్ నిర్వహణ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను అధికారులు ఆదేశించారు.

# తానూర్ మండల కేంద్రంలో రైతు భరోసా నిధుల విడుదల సంబరాలు

తానూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): తానూర్ మండల కేంద్రంలో వానాకాలం పంట పెట్టుబడి రైతు భరోసా నిధులు విడుదలైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యుడు గడ్డం విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, వానాకాలం సాగు పనులు ప్రారంభమవుతున్న సరైన తరుణంలో రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నిధులు జమ కావడం వల్ల విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ అవసరాలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా సర్వేను పరిశీలించిన తహశీల్దార్



తానూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): తానూర్ మండలంలోని ఝరి బి గ్రామంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియను తానూర్ తహశీల్దార్ మహేంద్రనాథ్ బుధవారం స్వయంగా పరిశీలించారు. మండలంలోని పలు ఆయా ప్రాంతాల్లో బీఎల్ఓలు ఇళ్లకు వెళ్లి నిర్వహిస్తున్న ఓటర్ల సర్వే తీరును ఆయన దగ్గరుండి క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మహేంద్రనాథ్ మాట్లాడుతూ, పారదర్శకమైన, ఎలాంటి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన కోసం ప్రతి పౌరుడు, కుటుంబ సభ్యులు ఈ ప్రభుత్వ సర్వేకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటర్ సర్వేను నిర్ణీత గడువులోగా విజయవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ అధికారిక పర్యవేక్షణ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి (జిపిఓ) రజిత, బూత్ లెవెల్ అధికారి (బిఎల్ఓ) మైనాబాయి, కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఏ) గైక్వాడ్ సాయినాథ్ ఝరి పాల్గొన్నారు.

## చించాల గ్రామంలో వన మహోత్సవం.. ఇంటింటికీ మొక్కల పంపిణీ




ముధోల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలంలోని చించాల గ్రామంలో బుధవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ హరిత కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ ఉచితంగా మొక్కల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా చించాల గ్రామ సర్పంచ్ సర్వేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కకు నిత్యం నీరు పోసి చెట్టుగా పెంచాలని, ఇది పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. చెట్లు ఉంటేనే గ్రామానికి అందంతో పాటు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యం లభిస్తుందని, మొక్కలను సంరక్షించడం మన అందరి సామాజిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయినాథ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రమ్య, వార్డు సభ్యులు యోగేష్, లాస్మన్న, భూషణ్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, శివాజీ పాల్గొన్నారు.

## టీచర్స్ కాలనీలో ఓటర్ల ఫారాలు పూర్తి చేస్తూ బిఎల్ఓలకు దొండి రమణ సహాయం



ఆర్మూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల కమ్యూనిటీ హాల్ నందు బుధవారం స్థానిక ఓటర్ల కొరకు ప్రత్యేక సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలనీ వీధి ప్రజలకు ఎస్ఐఆర్ ఫారాలు పూర్తి చేయడంలో బూత్ లెవెల్ అధికారులకు (బిఎల్ఓ) కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దొండి రమణ స్వచ్ఛందంగా తన వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అత్యంత అమూల్యమైనదన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవడం మన బాధ్యత అన్నారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలంటే జాబితాలో పేరు ఉండటం ప్రాథమిక అవసరమని, కొత్తగా నమోదు చేయాలన్నా, చిరునామా తప్పులు సరిదిద్దాలన్నా ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ముధోల్ మండల కేంద్రంలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

.ముధోల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రావుల గంగారెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల గుండెల్లో నిలిచిన ఆశాజ్యోతి అని కొనియాడారు. ఉచిత విద్యుత్, ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రుణాల మాఫీ ద్వారా రైతు సంక్షేమానికి విశేష కృషి చేసిన నిజమైన రైతు బాంధవుడు వైఎస్సార్ అన్నారు. ఆయన హయాంలో ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108 ఉచిత అంబులెన్స్, ఫీజు రీఇంబర్స్‌మెంట్ వంటి చారిత్రాత్మక పథకాల ద్వారా పేద ప్రజలకు మెరుగైన జీవితం దక్కిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, వార్డు సభ్యుడు అజీజ్, పార్టీ నాయకులు కిషన్ పాతంగే, గోవింద్ పటేల్, నగేష్, రాజు, లక్ష్మణ్, దిగంబర్ పాల్గొన్నారు.



## రైతు భరోసా నిధుల విడుదల సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



ముధోల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం సంవత్సర రైతు భరోసా పెట్టుబడి సహాయ నిధులను విడుదల చేసిన సందర్భంగా ముధోల్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, రైతులు కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం నిర్వహించి తమ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రికార్డు స్థాయిలో కేవలం ఆరు రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 68.37 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో 7,490.72 కోట్ల రూపాయల భారీ నిధులను జమ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు పక్షపాత సంక్షేమానికి నిదర్శనమన్నారు. పెట్టుబడి సాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ముధోల్ రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ షాబానా బేగం ఏజాజ్ ఉద్దీన్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ పోతున్న యాదవ్, జనరల్ సెక్రటరీ బషీర్, సీనియర్ నాయకులు మాగ్దుమ్, శ్రీనివాస్ గౌడ్, సమీ, కిష్టయ్య, విశ్వంబర్, ముజీబ్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి




ముధోల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): వర్షాకాలం నేపథ్యంలో ప్రబలే వివిధ రకాల సీజనల్ వ్యాధుల పట్ల పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ దయానంద్ రెడ్డి సూచించారు. బుధవారం ముధోల్ మండల కేంద్రంలోని రబింద్ర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వర్షాకాల వ్యాధుల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోమలు కుట్టకుండా వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని, ఇళ్ల పరిసరాల్లో మురికి గుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. పూలకుండీలు, ఎయిర్ కూలర్లలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు మార్చాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ జ్వరం రక్తకణాల సంఖ్యను తగ్గించి ప్రాణాంతకంగా మారుతుందన్నారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, శరీరం అంతా కప్పబడేలా దుస్తులు ధరించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ అసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ, విద్యార్థులు బయట లభించే ఈగలు వాలిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ దయానంద్ ను పాఠశాల యాజమాన్యం శాలువాతో ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యాదవ్, భీమ్‌రావు దేశాయ్, ఆర్ఎంపీ డాక్టర్ కృష్ణ, నర్సింగ్, సాయిబాబా పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలకు ఎంఈఓ నోటీసులు..



ఆర్మూర్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం ఆలూరు మండల పరిధిలోని హోవర్డ్ పార్క్ పాఠశాల, వాగ్దేవి పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి ఎం. నరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో హోవర్డ్ పార్క్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు నేరుగా అమ్ముతున్న విషయాన్ని గమనించిన ఎంఈఓ, తక్షణమే సదరు పాఠ్య పుస్తకాల గదిని సీల్ వేసి యాజమాన్యానికి అధికారిక నోటీసులు జారీ చేశారు. అలాగే పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పాటించకుండా విధులు నిర్వహిస్తున్న శిక్షణ లేని ఉపాధ్యాయులను వెంటనే బాధ్యతల నుండి తొలగించాలని, వారి స్థానంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం శిక్షణ పొందిన అర్హులైన ఉపాధ్యాయులచేతనే బోధన జరపాలని గట్టిగా హెచ్చరించారు. ఈ అక్రమ విధానాలపై పూర్తి వివరణ ఇవ్వాలని రెండు పాఠశాలల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. మండలంలోని మిగతా ప్రైవేట్ పాఠశాలలు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే విద్యాసంస్థలను నిర్వహించాలని, నిబంధనలు పాటించని పాఠశాలలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ నరేందర్ స్పష్టం చేశారు.

## సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఏలేటి భూమి పూజ

నిర్మల్ రూరల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ రూరల్ మండల పరిధిలోని చిట్యాల్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులు 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బీజేపీ శాసనసభా పక్ష నేత, నిర్మల్ శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో రవాణా సౌకర్యాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ఈ రహదారి పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను సూచించారు. గ్రామాల సమగ్ర వికాసానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో స్థానిక నాయకులు ముత్యం రెడ్డి, జమాల్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, చిట్యాల్ సర్పంచ్ ఏనుగు సుప్రియ వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ రమేష్, మౌలానా పాల్గొన్నారు.

## భైంసా గ్రీవెన్స్ డేలో ప్రజల సమస్యలు విన్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

భైంసా, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువయ్యేలా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ డే (ఫిర్యాదుల దినోత్సవం) నిర్వహించి ప్రజల నుంచి స్వయంగా వినతులు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన బాధితుల ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీసు అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రతి కేసును ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. కుటుంబ వివాదాలకు సంబంధించిన పలు ఫిర్యాదులపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. పరస్పర అవగాహనతో కొన్ని కుటుంబాలు తిరిగి కలిసేలా చేయడంలో షీ టీం కీలక పాత్ర పోషించింది. నిర్మల్ జిల్లా కేంద్రం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా భైంసాలోనే కౌన్సిలింగ్ నిర్వహించడం పట్ల బాధితులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గత గ్రీవెన్స్ డేల్లో అందిన ఫిర్యాదుల పరిష్కార స్థితిపై సమీక్షించిన ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.




## ఏఈఓల పంట నమోదు లోపాల వల్ల రైతు భరోసా నిరాకరణ అన్యాయం



నిర్మల్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈఓ) పంట నమోదు లోపాల కారణంగా అర్హులైన రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని నిరాకరించడం అన్యాయమని, దీనిపై జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర విచారణ జరపాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. బుధవారం నిర్మల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) అంజి ప్రసాద్ ను వేదిక రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నూనెల ఆచార్య కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట వివరాలను ప్రభుత్వ అధికారిక పోర్టల్ లో నమోదు చేసే సాంకేతిక అధికారం రైతులకు లేదు కాబట్టి, ఆ పూర్తి బాధ్యత ఏఈఓలదేనన్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ఇష్టానుసారంగా తప్పుడు వివరాలు నమోదు చేయడం వల్ల అమాయక రైతులు పెట్టుబడి సాయం కోల్పోతున్నారన్నారు. రైతు భరోసా అనేది ప్రస్తుత వానాకాలం సాగు పెట్టుబడి కోసం ఇచ్చే సహాయం కానీ, గత సీజన్ల నమోదు ఆధారంగా నిర్ణయించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి అర్హులైన రైతులకు నిధులు విడుదల చేయాలని, తిరస్కరణకు ముందు రైతులకు ఎస్ఎంఎస్ ద్వారా ముందస్తు నోటీసు ఇచ్చి చెప్పుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

## నిరుద్యోగులు, చిరు వ్యాపారులకు 20 తోపుడు బండ్ల పంపిణీ

సోన్, జూలై 08 (తెలంగాణ వెన్నెల వాక్కు): జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ (ఎన్ఈసీసీ) సౌజన్యంతో, నిర్మల్ వశిష్ట విద్యాసంస్థలు, అభిరాం ఫ్యూయల్స్ ప్రత్యేక సహకారంతో సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామ అభిరామ్ పెట్రోల్ బంక్ ఆవరణలో బుధవారం నిరుద్యోగులకు, చిరు వ్యాపారులకు ఉచితంగా తోపుడు బండ్లను పంపిణీ చేశారు. నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి. సత్యనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై 20 మంది లబ్ధిదారులకు తోపుడు బండ్లు, గ్యాస్ సిలిండర్లు, ఇతర వ్యాపార సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద నిరుద్యోగులు ఉచితంగా పంపిణీ చేసిన ఈ తోపుడు బండ్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. పోషకాహారాన్ని అందించే కోడిగుడ్డు ప్రాముఖ్యతను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా 35 వేల మంది సభ్యులు కలిగిన ఎన్ఈసీసీ సంస్థ సామాజిక బాధ్యతగా నిరుద్యోగుల జీవనోపాధికి చేస్తున్న ఈ సహాయం అభినందనీయమన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com